సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 10 । ఆగస్టు । 2025

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఉదయం జల్లులు, మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



ఇల్లెందు బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

రక్షాబంధన్ సందడి



కొత్తగూడెంలో చిన్నారుల 'రాఖీ' చిద్విలాసం



కొత్తగూడెంలో పార్కులో రాఖీ వేడుకలు..

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనురాగ వేడుక రాఖీ పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టింటికి వెళ్లి సోదరులకు రాఖీలు కట్టారు. స్వీట్లు పంపిణీ చేశారు. సోదరులు బహుమతులు ఇచ్చారు. రక్షాబంధన్ పురస్కరించుకుని ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి. బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు అశ్వారావుపేట ప్రయాణ ప్రాంగణాల్లో సందడి నెలకొంది. అయితే తగిన సంఖ్యలో ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థపడ్డారు. –కొత్తగూడెంటౌన్/చుంచుపల్లి/ఇల్లెందు

న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం చండీహోమం పూజలను వైభవంగా జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాల నడుమ, వేద మంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలు గావించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో పాల్గొన్న 11 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, సభ్యులు చందుపట్ల రమ్య, పాపారావు, రామిరెడ్డి, శ్రీనివాస్, సాయిబాబా, సుధాకర్, శేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి



వివరాలు వెల్లడిస్తున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: పిల్లల తల్లిదండ్రులు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జయలక్ష్మి సూచించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 11, 18వ తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో 19 ఏళ్లలోపు పిల్లలు 3,36,136 మందికి నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,771 పాఠశాలలు, కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మాత్రలు రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనమైన మానసిక, శారీరక అభివృద్ధిని నివారిస్తాయని వివరించారు.

అకస్మాత్తుగా ఊడిన ఆర్టీసీ బస్సు టైరు

అశ్వాపురం: మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. భద్రాచలం నుంచి మణుగూరు వెళ్తున్న బస్సు వెనుక టైరు అశ్వాపురం మండలం మిట్టగూడెం క్రాస్ రోడ్డు వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై అకస్మాత్తుగా ఊడింది. దీంతో బస్సు రహదారి పక్కకు దూసుకెళ్లింది. ఊడిన టైరు ఓ స్కూటీకి తగలడంతో, స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సింగరేణి 'ఫారెస్టు' అక్రమాల డొల్ల..



సింగరేణి ప్రధాన కార్యాలయం

- భూపాలపల్లి ఏరియాలో అక్రమాలపై విచారణ పూర్తి
- కలప విక్రయాల్లో రూ.50 లక్షలకు పైగా తేడా
- ఇతర ఏరియాల్లోనూ విచారణకు పెరిగిన డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సామాజిక బాధ్యత, సంస్థ అవసరాల మేరకు పని చేయాల్సిన ఫారెస్టు విభాగంపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జామాయిల్ చెట్ల నరికివేత, అమ్మకాల విషయంలో కేవలం భూపాలపల్లి సంఘటనే వెలుగు చూసిందని, కానీ వెలుగులోకిరాని నిజాలెన్నో ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

కేవలం భూపాలపల్లి ఘటనపైనే విచారణ

సింగరేణి సంస్థ పరిధిలో 11 ఏరియాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో సింగరేణి సంస్థ భారీగా జామాయిల్ చెట్లను పెంచుతోంది. ఏపుగా పెరిగిన చెట్లను నరికి సంస్థ అవసరాల కోసం వినియోగిస్తోంది. చెట్లను నరకడంతో పాటు వాటిని దుంగలు/మొద్దులుగా మార్చి ఇవ్వాల్సిన పనిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. ఈ క్రమంలో భూపాలపల్లి ఏరియాలో 2018 నుంచి 2020 వరకు జరిగిన లావాదేవీల్లో రూ. 50 లక్షలకు పైగా పక్కదారి పట్టినట్టు సంస్థ విజిలెన్స్ విభాగం దృష్టికి వచ్చింది. దీంతో శాఖాపరమైన విచారణ చేపట్టి నివేదికను సిద్ధం చేశారు. అవకతవకలకు కారణమైన ఉద్యోగులు, అధికారులపై ఏ రకమైన చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

అసలేం జరిగిందంటే..?

గనుల్లో బొగ్గును తీసిన తర్వాత ఏర్పడిన గుల్ల ప్రదేశంలో బొగ్గు పొరలు కూలి కిందపడకుండా సపోర్ట్‌గా ఐరన్ రాడ్స్, కలప దుంగలను పెడుతుంటారు. ఇందుకోసమే సింగరేణి సంస్థ వేలాది ఎకరాల్లో యూకలిప్టస్ చెట్లు పెంచుతోంది. జామాయిల్ చెట్టు మొదలు (ప్రోప్), మధ్య (చోక్) భాగాలు సపోర్టింగ్ పిల్లర్లుగా ఉపయోగపడతాయి. చెట్టుపై భాగంలో సన్నగా, పీలగా ఉండే కలప సపోర్టింగ్ పిల్లర్‌గా పనికి రాదు. కానీ పేపర్ పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. వీటితో పేపర్ పల్ప్‌ను తయారు చేస్తారు. దీంతో నరికివేసిన చెట్ల నుంచి ప్రధాన అవసరమైన సపోర్టింగ్ పిల్లర్లకు సంబంధించిన కలపను సంస్థకు కాంట్రాక్టరు ముందుగా అప్పగించాలి. ఆ తర్వాత మిగులుగా తేలిన జామాయిల్ చెట్ల పై భాగానికి సంబంధించిన వివరాలను వెల్లడించాలి. అనంతరం వాటిని పేపర్ పరిశ్రమలకు అమ్మి, ఆ మేరకు కమీషన్ తీసుకుని మిగిలిన సొమ్మును సంస్థ ఖాతాలో జమ చేయాలి. భూపాలపల్లి ఏరియాలో మిగులు కర్రను కాంట్రాక్టరుకు అప్పగించారు. అయితే తిరిగి ఎంత సొమ్ము సంస్థఖాతాలో జమైంది అనే వివరాల్లో భారీ అంతరాలు చోటు చేసుకున్నట్టు ఫిర్యాదు అందింది.

ఇతర ఏరియాల్లో విచారణ జరపాలి...

భూపాలపల్లి ఏరియాలో 2018 నుంచి 2020 మధ్య కాలంలో చోటుచేసుకున్న అక్రమాల కారణంగా సంస్థకు రూ. 50 లక్షలకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్టుగా తేలింది. సంస్థ పరంగా ఫారెస్టు విభాగంలో పని చేసే అధికారుల మధ్య చోటు చేసుకున్న ఆధిపత్య పోరు చినికిచినికి గాలివానగా మారడంతో ఈ వ్యవహారం విజిల్ బ్లోయర్ ద్వారా విజిలెన్స్ దృష్టికి వచ్చింది. లేదంటే సంస్థకు రావాల్సిన రూ. 50 లక్షలకు పైగా సొమ్ము రాకుండా పోయేది. ఈ తరహా అవకతవకలు ఇతర ఏరియాల్లోనూ జరిగాయనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. దీంతో భూపాలపల్లి తరహాలోనే ఇతర ఏరియాల్లోనూ విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి. సంస్థ పరిధిలోని అన్ని ఏరియాల్లో కనీసం గడిచిన ఐదేళ్ల కాలంలో ఫారెస్టు విభాగంలో జరిగిన లావాదేవీలపై దృష్టి సారించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. కేవలం కర్ర అమ్మకాలే కాకుండా ఎంత విస్తీర్ణంలో కటింగ్ చేయాల్సి ఉండగా ఎంత ఏరియాలో చెట్లను నరికారనే అంశాలపై కూడా దృష్టి పెట్టాలంటున్నారు. దీంతో పాటు భవిష్యత్‌లో చెట్లు నరికే విషయంలో అవకతవకలు జరిగేందుకు వీలులేకుండా పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కొత్త నిబంధనలు రూపొందించాలంటున్నారు.

పైస్థాయిలో అలా.. కింది స్థాయిలో ఇలా

సామాజిక బాధ్యతగా ఐదు కోట్లకు పైగా మొక్కలు నాటిన సంస్థగా సింగరేణి రికార్డు సాధించింది. 2019లో సంస్థలో డైరెక్టర్ పాగా బాధ్యతలు చేపట్టింది మొదలు ప్రస్తుతం సీఎండీ వరకు రికార్డు స్థాయిలో 20 వేలకు పైగా మొక్కలు స్వయంగా నాటారు. అఖిల భారత స్థాయి అధికారుల్లో ఫారెస్టు వారిని మించి మరీ ట్రీమ్యాన్‌గా గుర్తింపు పొందారు. మరోవైపు ఆ సంస్థ పరిధిలో ఉన్న ఫారెస్టు విభాగం అక్రమాలకు వేదికగా మారడం గమనార్హం.

ఘనంగా హయగ్రీవ జయంతి

- వేడుకగా ముగిసిన పవిత్రోత్సవాలు
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం



హయగ్రీవునికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం హయగ్రీవ జయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హయగ్రీవుని ఉపాలయంలో పండితులు వేదమంత్రాలు, భక్తజనాల శ్రీరామస్మరణల నడుమ హయగ్రీవునికి ఉదయం ప్రత్యేక స్నపనం, తిరుమంజనం జరిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు విజయరాఘవన్ చేతుల మీదుగా చిన్నారులకు పలకలు, సామగ్రి అందజేశారు. పవిత్రోత్సవాల ముగింపులో భాగంగా యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కుంభప్రోక్షణ, పవిత్రావరోపణాలతో ఉత్సవ స్వస్తి పలికారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని నిలిపివేసిన నిత్యకల్యాణాలు ఆదివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. వారాంతపు సెలవు రోజులు కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో అనువైన ప్రదేశాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్రమైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి(ఎనర్జీ) నవీన్ మిట్టల్, జెన్‌కో సీఎండీ, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ, సింగరేణి సీఎండీలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్‌స్టలేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సోలార్ విద్యుదుత్పత్తికి చేపట్టనున్న చర్యలను కలెక్టర్ వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిన్నెరసాని నీటి విడుదల



కిన్నెరసాని నుంచి దిగువకు వదులుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 8 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా శనివారం నీటిమట్టం 404.80 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్‌కు చెందిన ఒక గేటును ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఆదివాసీ సంస్కృతిని పరిరక్షించాలి



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం, కలెక్టర్ జితేష్, పీఓ రాహుల్ తదితరులు

- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్, పీఓ, సబ్ కలెక్టర్

భద్రాచలం: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ, ఆదివాసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. గిరిజన భవనంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లంవెంకట్రావు మాట్లాడుతూ ఆదివాసీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఆదివా సీ సంస్కృతీసంప్రదా యాలను అందించాలని చెప్పారు. ఐటీడీఏ తోడ్పాటుతో స్వయం సహాయక గ్రూపుల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ గిరిజనుల ఆర్థిక అసమతుల్యతను పారదోలేందుకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని పేర్కొన్నారు. భద్రాచలం ఐటీడీఏ పేరు ఢిల్లీలో మార్మోగుతుండటమే ఇందుకు నిదర్శమని అన్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోయ భాష లిపిని అభివృద్ధి చేస్తున్నామని, ఆది వాసీల ఇలవేల్పుల చరిత్రను గ్రంథ రూపంలోకి తెస్తున్నట్లు వివరించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ఏజెన్సీ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్లను ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత గిరిజన భవన్‌లో నిర్వహించిన ఆదివాసీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గిరిజన మ్యూజియం టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు. తొలుత ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ కూడలిలో ఉన్న ఆదివాసీ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు డేవిడ్‌రాజ్, మణెమ్మ, సున్నం రాంబాబు, అన్ని విభాగాల సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులు పూనెం కృష్ణ, పాయం రవి వర్మ, శరత్ బాబు, మురళి, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, సుధారాణి, అరుణ , వెంకటరావు వీరభద్రం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు తోడ్పాటు : ఎస్పీ



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఆదివాసీలు,(ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ఆదివాసీ ప్రజలు అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పాటునందిస్తామని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శనివారం కొత్తగూడెం పోలీస్ డివిజన్‌ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ర్యాలీని ఎస్పీ రోహిత్‌రాజు ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్ మీదుగా కొత్తగూడెం క్లబ్ వరకు ర్యాలీ కొనసాగింది. కొత్తగూడెం క్లబ్‌లో ఎస్పీతోపాటు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ కనకమ్మ తదితరులు ఆదివాసీ నేతలు కొమరంభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీల కోసం పోలీసుశాఖ తరపున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నామని, ఉద్యోగ అవకాశాలకోసం శిక్షణ ఇప్పిస్తున్నామని వివరించారు. రెండు మొబైల్ ఆస్పత్రులు, మూడు గ్రంథాలయాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆదివాసీ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. సీఐలు శ్రీనివాస్, కరుణాకర్, శివప్రసాద్, ప్రతాప్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: చందాల విషయంలో జరిగిన ఘర్షణ ఘటనలో పోలీసులు ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సంగం గ్రామానికి చెందిన పలువురు కలిసి వన దేవత కోసం గ్రామంలో చందాలు వసూలు చేశారు. లెక్కల విషయమై బొర్రెం ఏసుతో ఈ నెల 5న ఇంజమూరి సాయి, నక్కారి సాయిదుర్గాప్రసాద్, శంఖు ప్రణయ్‌లు గొడవ పడి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ - బొలేరో వాహనం ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బొలేరో వాహనం

తిరుమలాయపాలెం: బొలేరో వాహనం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం తెల్లవారుజామున దమ్మాయిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి పూల మొక్కల లోడుతో నిర్మల్ వెళ్తున్న బొలేరోను వాహనం దమ్మాయిగూడెం సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే మరిపెడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో బొలేరో వాహనం డ్రైవర్ ఆకుల లోవరాజు, తోడుగా వచ్చిన బొడ్డుపల్లి ప్రదీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి శ్రీలం సుదర్శన్‌రావు, అతడి కుమారుడు చైతన్యపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్ మీరా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సుదర్శన్‌రావు కుటుంబసభ్యులకు సంబంధించిన భూ వివాదంపై ఈనెల 6న తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గ్రామానికి చెందిన మాలెంపు కోటేశ్వరరావు, వారి కుటుంబసభ్యులు ఈ వివాదంలో జోక్యం చేసకోగా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సుదర్శన్‌రావు, అతడి కుమారుడిపై దాడి చేసిన ఘటనలో కోటేశ్వరరావుతో పాటు విజయ, పద్మావతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గోపీకిరణ్ (ఫైల్)

వేంసూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కొత్తపల్లి గోపీకిరణ్(20) భీరపల్లి శివారున ఉన్న పెట్రోల్ బంక్‌లో నుంచి ప్రధాన రహదారిపైకి వస్తుండగా మొద్దులగూడెం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన గోపీకిరణ్‌ను చికిత్స నిమిత్తం సత్తుపల్లికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

'ఇల్‌నెస్' సెంటర్..!

వెల్‌నెస్ సెంటర్‌పై పట్టింపు కరువు
- వేధిస్తున్న మందుల కొరత
- నామమాత్రపు ఔషధాలతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇబ్బంది పడుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు



పెద్దాసుపత్రిలోని వెల్‌నెస్ సెంటర్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ బాలారిష్టాలు ఎదుర్కొంటోంది. ఈ సెంటర్‌ను కొన్ని నెలలుగా మందుల కొరత వేధిస్తోంది. అవసరమైన మందులు దొరకక ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి పరిస్థితి దయనీయంగా మారింది. అవసరమైన మందులు దొరకక కొందరు ఆస్పత్రి చుట్టూ తిరుగుతుండగా, మరికొందరు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కేవలం ఓపీ సేవలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజువారీ మాత్రలు కూడా లేక..

వెల్‌నెస్ సెంటర్‌కు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో 40 ఏళ్లు దాటిన వారు ఎక్కువగా బీపీ బారిన పడుతున్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో దాదాపు 80 నుంచి 90 శాతం మంది రక్తపోటుతో బాధపడుతున్నారు. కొందరు బీపీతో పాటు షుగర్ మాత్రలు రోజూ వేసుకోవాల్సి వస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత గల మందులు వెల్‌నెస్ సెంటర్‌లో ఆరు నెలలుగా అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు ట్రస్ట్ నుంచి మాత్రలు వస్తున్నా ఒకటి, రెండు రోజుల్లోనే అయిపోతున్నాయి.

తాకిడి ఉన్నా పట్టింపు కరువు..

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 200 మంది వెల్‌నెస్ సెంటర్‌కు వైద్య సేవల కోసం వస్తుంటారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ, డెంటల్ తదితర సేవలు అందుతాయి. టెస్టులకు ల్యాబ్, ఫార్మసీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, నరాల బలహీనత, జ్వరం, ఇతర సీజనల్ వ్యాధులకు చికిత్స చేస్తారు. అయితే ఇక్కడ బీ కాంప్లెక్స్, ఇన్సులిన్, థైరాయిడ్, గ్యాస్, జ్వరం, జలుబు, దగ్గు, అస్తమా రోగులకు ఇన్‌హెల్లర్లు అందుబాటులో లేవు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు మందులు దొరక్క నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి..

ఉమ్మడి జిల్లా ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూత్ర పరీక్షల శాంపిళ్లు తీసుకోవడానికి కనీసం బాత్‌రూమ్‌లు కూడా లేవు. దాని కోసం జనరల్ ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌ల్లోకి వెళ్లాల్సి వస్తోంది. ఓపీ, ఇతర విభాగాల్లో కుర్చీలు కూడా లేవు. గదుల్లో కిటికీలకు కర్టన్లు లేక పగటి పూటే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సెంటర్‌లో సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ముగ్గురు ఫార్మసిస్టులకు ఇద్దరు, నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇద్దరు, నలుగురు స్టాఫ్‌నర్సులకు ఇద్దరు, ముగ్గురు మెడికల్ ఆఫీసర్లకు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా పెషెంట్లకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. గైనిక్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ సేవలు అందుబాటులో లేక ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. బీపీ మిషన్ మరమ్మతులకు గురి కాగా, పక్కన పెట్టారు. అలాగే 400 రకాల మందులు అందుబాటులో ఉండాల్సిన ఈ సెంటర్‌లో 150 రకాలు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా వెల్‌నెస్ సెంటర్‌కు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి బ్రాండెడ్ మందులు సరఫరా అవుతాయి. ఒక్కో రోగి నెలకు సరిపడా మందులు తీసుకెళ్తుంటారు. అవి అందుబాటులో లేక ప్రైవేటు షాపుల్లో డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

మూడు నెలలుగా మందులు లేవు



మూడు నెలలుగా వెల్‌నెస్ సెంటర్ చుట్టూ తిరుగుతున్నా మందులు అందుబాటులో ఉండట్లేదు. ఎప్పుడు వస్తాయనే సమాచారం చెప్పే వారు కూడా లేరు. బీపీ, షుగర్, థైరాయిడ్‌తో ఇబ్బంది పడుతున్నా. ఈ సెంటర్‌తో ఉపయోగం లేకుండా పోయింది. – ఎ.జయలక్ష్మి, ఖమ్మం

మందుల కొరత వాస్తవమే



వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత వాస్తవమే. ట్రస్ట్‌కు ఇండెంట్ పెట్టాం. త్వరలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న మందులతో సేవలు అందిస్తున్నాం. రోగులకు సాధ్యమైనంత వరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. కొంత మేరకు సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సౌకర్యాలపై కూడా నివేదిక పంపించాం.
– డాక్టర్ నారాయణమూర్తి, వెల్‌నెస్ సెంటర్ జనరల్ ఫిజీషియన్



మాట్లాడుతున్న ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్

సమాచారం అడిగే హక్కు అందరికీ ఉంది

స.హ. చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్ : సమాచారం అనేది వజ్రాయుధమని, అవసరమైన సమాచారాన్ని సేకరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన స.హ.చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కును దుర్వినియోగం చేయొద్దని, దీన్ని అడ్డుపెట్టుకుని కొందరు ప్రలోభాలకు గురిచేస్తూ అడ్డదారులు ఎంచుకోవడం సరైంది కాదని హెచ్చరించారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005కు అనుగుణంగా కోరిన వారికి సకాలంలో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అప్పిలేట్ అధికారిపై ఉంటుందని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణరావు, జగదీష్, న్యాయవాది తిరుమలరావు, ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ సుబ్బారావు, శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ కలప మాయంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: మండల పరిధిలోని రంగాపురం శివారు ప్లాంటేషన్‌లో జామాయిల్ కలప మాయంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్‌లో ఇటీవల 500కు పైగా జామాయిల్ చెట్లను అక్రమార్కులు నరికి కలప చోరీచేశారు. ఈ ఉదంతంపై శుక్రవారం 'జా మాయిల్ కలప మాయం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో టీజీఎఫ్‌డీసీ అధికారుల్లో కదలిక వచ్చింది. హైదరాబాద్ కేంద్ర కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి నరికిన జామాయిల్ చెట్లను పరిశీలించి, వివరాలు సేకరించారు. ఈ క్రమంలో సంస్థ పరిధి లోని 220 కేవీ లైన్ల కింద భూమిలో పలువురు సేద్యం చేస్తున్న విషయాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా విచారణ వ్యవహారంపై స్థానిక అధికారులు గోప్యత పాటించడం గమనార్హం.

వరుసగా రెండు ఘటనలు

అటవీ అభివృద్ధి సంస్థ టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్లలో మూడు వారాల వ్యవధిలో రెండు కలప చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. జిన్నెలగూడెం ప్లాంటేషన్ పరిధిలో 50 హెక్టార్లలో సుమారు రెండు నెలల క్రితం జామాయిల్ చెట్లను కటింగ్ చేసి విక్రయించారు. ఈక్రమంలో మొట్లకు లేలేత చిగుర్లు వచ్చాయి. ఆ చిగుర్లను చోరీ చేసి జామాయిల్ క్లోన్స్ తయారుచేసేవారికి విక్రయించారు. ఈ ఘటనపై గత నె 12న 'జామాయిల్ మొక్కల చిగుర్లు చోరీ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. తాజాగా రంగాపురం శివారు ప్లాంటేషన్‌లో సుమారు 500 జామాయిల్ మొక్కలు నరికి విక్రయించారు.



జామాయిల్ ప్లాంటేషన్‌లో పరిశీలిస్తున్న అధికారులు

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో శనివారం రాఖీ పౌర్ణమి సందడి కనిపించింది. మండల పరిధిలోని కిన్నెరసానికి శనివారం జిల్లా నలు మూలల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. 383 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,855 ఆదాయం లభించింది. 150 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.6,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

హత్య కేసులో ఆరుగురు అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: చేతబడి చేశాడనే అనుమానంతో ఓ వ్యక్తిని కర్రలతో కొట్టి చంపిన ఘటనలో ఆరుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. టేకులపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ నూనావత్ చంద్రభాను వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండలం పెద్దవెంకటాపురం పంచాయతీ బూసురాయి గుత్తికోయ గుంపునకు చెందిన పొడియం నంద కుమార్తె గంగి అనారోగ్యంతో గత బుధవారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన మడకం బీడ అలియాస్ రాజు (35) చేతబడి చేయడం వల్లే గంగి మృతి చెందిందని బాలిక తల్లిదండ్రులు అనుమానించారు. రాజును బాలిక మృతదేహం వద్దకు తీసుకొచ్చి పంచాయితీ పెట్టారు. పంచాయితీలో దోషిగా పేర్కొంటూ తాళ్లతో కట్టేసి ఆరుగురు వ్యక్తులు కర్రలతో విపరీతంగా కొట్టడంతో తీవ్ర గాయాలై రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితులు పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎన్ చంద్రభాను, సీఐ సత్యనారాయణ

నిందితులు ఛత్తీస్‌గఢ్‌లోని సొంత గ్రామాలకు వెళ్తుండగా నిఘా పెట్టిన సీఐ బత్తుల సత్యనారాయణ, ఆళ్లపల్లి ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ శనివారం పెద్ద వెంకటాపురం ప్రైమరీ స్కూల్ వద్ద పట్టుకున్నారు. మడవి రాజు, మొక్కటి చిన్నసోమయ్య, మొక్కటి భీమయ్య, వంజం గంగ, నందం జోగ, మొక్కటి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. చేతబడి, బాణామతి వంటి మూఢ నమ్మకాలతో దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



ఖాసీం(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల వీఆర్‌ఏ ఖాసీం (73) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఖాసీంకు భార్య జయతున్నీషా బేగం, ఎనిమిది కూతుర్లు ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని హనుమంతులపాడు గ్రామానికి చెందిన కోరం సంతోష్‌కుమార్ (28) రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య తేజశ్రీ ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

దుమ్ముగూడెం: మండలంలోని తురుబాక గ్రామానికి చెందిన యువకుడు, బూర్గంపాడు మండలానికి చెందిన యువతి ప్రేమ వివాహం చేసుకుని రక్షణ కోసం శనివారం దుమ్ముగూడెం పోలీసులను ఆశ్రయించారు. కొంత కాలంగా ప్రేమించుకుంటున్న వీరి వివాహానికి యువతి తల్లితండ్రులు ఒప్పుకోకపోవడంతో ప్రేమజంట రహస్యంగా వివాహం చేసుకుంది. రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నారని నచ్చజెప్పారు.

32 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మణుగూరు టౌన్: ఒడిశా నుంచి వరంగల్‌కు తరలిస్తున్న గంజాయిని శనివారం మణుగూరు పోలీసులు పట్టుకున్నారు. సీఐ పాటి నాగబాబు కథనం ప్రకారం.. ఎస్‌ఐ రంజిత్, సిబ్బందితో కలిసి తోగ్గూడెం శివారు ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేయగా 32 కేజీల గంజాయి లభించింది. విచారించగా అల్లూరి సీతారామరాజు జిల్లా పెద్దపాక మండలం కుసున్నపల్లి గ్రామానికి చెందిన తోడెం శ్రీను, మహబూబాద్ జిల్లా బోడగుట్ట తండా గ్రామానికి చెందిన బానోత్ కుమార్ ఆటోలో గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. గంజాయి విలువ రూ.16 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

పర్సులో రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు



బాధితురాలికి పర్సును అప్పగిస్తున్న పండ్ల వ్యాపారి దంపతులు

అశ్వారావుపేటరూరల్: దుకాణం వద్ద మరిచిపోయిన బంగారు ఆభరణాల పర్సును పండ్ల వ్యాపారి దంపతులు తిరిగి బాధిత మహిళకు అప్పగించారు. ఈ ఘటన శనివారం జరిగింది. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ అశ్వారావుపేటలోని ఓ జ్యూయలరీ షాపులో రూ.లక్షా 50 వేల విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసింది. తిరిగి వెళ్తున్న క్రమంలో ఆసుపాక శివారులో బిర్రం నరేష్, ప్రత్యూష దంపతుల దుకాణం వద్ద ఆగి డ్రాగన్ పండ్లను కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ఆభరణాల పర్సును అక్కడే పెట్టి ఆటోలో వెళ్లిపోయింది. గమనించిన పండ్ల వ్యాపారి గమనించి భద్రపరిచాడు. మూడు గంటల తర్వాత పర్స్ పోగొట్టుకున్నట్లు గుర్తించిన మహిళ తిరిగి వెతుక్కుంటూ వచ్చింది. నరేష్ దంపతులు ఆభరణాల పర్సు అందజేసి నిజాయితీ చాటుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారి దంపతులను పలువురు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పినపాక: రైతుల పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రాగిని అమ్ముకుంటున్న ఐదుగురు సభ్యుల ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ముఠా సభ్యులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగిని తీసుకుని హైదరాబాద్, పాల్వంచలోని స్క్రాప్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తేలిందని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి తెలిపారు. వారి నుంచి 258 కేజీల రాగి, కారు, స్కూటీ, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సురేష్‌లను డీఎస్పీ అభినందించారు.

ఎట్టకేలకు 'మత్స్య' ప్రతిపాదనలు



కిన్నెరసానిలోని తొట్లలో చేపపిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

- ఈ ఏడాది కోటి 20 లక్షల చేపపిల్లల పంపిణీ లక్ష్యం
- మత్స్యశాఖ కమిషనర్‌కు నివేదించిన జిల్లా అధికారులు



చేప పిల్లలు(ఫైల్)

పాల్వంచరూరల్: ఎట్టకేలకు మత్స్యశాఖ అధికారులు ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలు రూపొందించారు. ఈసారి 550 చెరువుల్లో కోటి 20 లక్షల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం జిల్లాలో చిన్న చెరువులు, కుంటల్లో చేపపిల్ల పెంపకం చేపట్టొద్దని మత్స్యశాఖ నిర్ణ యం తీసుకుంది. జిల్లాలో చేపలు పెంచే చెరువులు, కుంటలు 734 ఉండగా, 70 మత్స్య పారిశ్రామిక సొసైటీలు ఉన్నాయి. వీటిల్లో 3,248 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకంపై సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అయితే పంపిణీ ప్రక్రియ ఆలస్యం కావడంతో పెద్దగా ఉపయోగం ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. జిల్లాలో గతేడాది కూడా చేప పిల్లలను ఆలస్యంగా పంపిణీ చేశారు. కేవలం 86 లక్షల చేప పిల్లలను మాత్రమే అందించారు. సీజన్ ప్రారంభంలో చెరువుల్లో చేప పిల్లలను వదిలితే 8,9 నెలలు పెరిగి ఆశించిన దిగుబడి లభించేది. ఈ నేపథ్యంలో ఈ సారి చేపపిల్లలకు బదులుగా నగదు ఇవ్వాలని మత్స్యకారులు ఇటీవల హైదరాబాద్‌లో మత్స్యశాఖ కమిషనర్‌ను కలిసి విన్నవించారు. నగదు ఇస్తే తామే కొనుగోలు చేసుకుని చెరువుల్లో వదులుకుంటామని పేర్కొన్నారు.

కిన్నెరసానిలో 12 లక్షల స్పాన్

కిన్నెరసానిలోని మత్స్యశాఖ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో 12 లక్షల గుడ్లను(స్పాన్) తెచ్చి వదిలారు. ఇక్కడి నీటి తొట్లలో రెండు నెలలపాటు పెంచి గిరిజన మత్స్యకార సొసైటీలకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. కేంద్రంలో 20 లక్షల చేప పిల్లల పెంపు సామర్థ్యంతో 13 నీటితొట్లు కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గతేడాది కేవలం 12 లక్షల చేపపిల్లలను మాత్రమే పెంచారు. ఈ సారి కూడా 12 లక్షల స్పాన్‌ను మాత్రమే పోశారు.

కరీంనగర్ నుంచి స్పాన్ తీసుకొచ్చాం



జిల్లాలో కోటి 20లక్షల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ కమిషనర్‌గా ఇటీవల ప్రతిపాదనలు పంపాం. కరీంనగర్ నుంచి స్పాన్ తీసుకొచ్చి కిన్నెరసాని ఉత్పత్తి కేంద్రంలో పెంచుతున్నాం. పెరిగాక పంపిణీ చేస్తాం. నీరు త్వరగా ఇంకిపోతున్నందున చిన్న చిన్న చెరువులు, కుంటల్లో ఈసారి చేపపిల్లలను వదలడం లేదు. – ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖాధికారి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.